క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి కృషి



కాలనీ వాసులతో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

అద్దంకి రూరల్: పునరావాస కాలనీ వాసుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి సోదరుడు అద్దంకి రూరల్ ఇన్‌చార్జి పానెం శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ధేనువుకొండ పునరావాస కాలనీలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

యాదవ మహాసభ నియోజకవర్గ అధ్యక్షుడిగా రమణబాబు



గోలి రమణబాబు

మేదరమెట్ల: అఖిలభారత యాదవ మహాసభ అద్దంకి నియోజకవర్గం అధ్యక్షుడుగా కొరిశపాడు గ్రామానికి చెందిన గోలి రమణబాబును నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు లక్ష్మీప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాదవుల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని, వారి సమస్యలపై పోరాటం చేస్తానని రమణబాబు ప్రకటనలో తెలిపారు.

రేపు ఉచిత ఉపకరణాల వైద్య నిర్ధారణ శిబిరం

జే.పంగులూరు: అద్దంకి స్థానిక భవితా కేంద్రం, ఎంపీయూపీ స్కూల్ (సత్రం బడి) అవరణంలో ఈనెల 28న ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచిత ఉపకణాల వైద్య నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నట్లు పంగులూరు భవిత కేంద్రం నిర్వాహకుడు యోహాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరం సహిత విద్య సమగ్ర శిక్ష బాపట్ల జిల్లా ఆధ్వర్యంలో 6 నుంచి 18 ఏళ్ల లోపు గల ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరానికి నియోజకవర్గ పరిధిలోని సంతమాగులూరు, జే పంగులూరు, కొరిశపాడు, అద్దంకి, బల్లికురవ మండలాల్లో వినికిడి లోపం గలవారికి యంత్రాలు, దృష్టిలోపం గల వారికి కంటి అద్దాలు, బ్రెయిలీ కిట్, మానసిక వైకల్యం, ఆటిజం (బుద్ధి మాంద్యం) గల వారికి టీఎల్ఎం కిట్, శారీరక అంగవైకల్యం కలవారికి ట్రై సైకిల్, వీల్ చైర్, రోలేటర్ తదితరమైన పరికరాలు ఉపకరణాలు నిపుణులైన డాక్టర్లచే వైద్య ధ్రువీకరణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఉపకరణాలు అందజేస్తారన్నారు. సదరం సర్టిఫికెట్ జిరాక్స్, ఆధార్, కార్డు జిరాక్స్, రేషన్ కార్డు జిరాక్స్, కుల ధ్రువీకరణ పత్రం, 2 పాస్ ఫోర్ట్ ఫోటోలు, యూడీఐడీ కార్డు తీసుకురావాలని తెలిపారు. వివరాలకు 98499 60723 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వేడుకగా బ్రహ్మోత్సవాలు

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడు తిరుమలనగర్‌లో కొలువైన భూసమేత వెంకటేశ్వర స్వామి వారి ద్విదశమి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం కన్నుల పండువగా నిర్వహించారు. గత నాలుగు రోజుల నుంచి స్థానిక వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఘనంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శైలజానాథ్, ప్రణవానందగిరి స్వామివార్ల దివ్య ఆశీస్సులతో నిర్వహించారు. స్వామి వారికి శాంతి కల్యాణం, సుప్రభాత సేవలు, చక్రస్నానం, గ్రామోత్సవాలను భక్తులు కోలాహలంగా నిర్వహించారు.



యద్దనపూడిలో ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ చేస్తున్న సిబ్బంది



అద్దంకిలో రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్వో

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం

- కోడ్ ఉల్లంఘన జరకుండా అధికారులు పర్యవేక్షించాలి

పర్చూరు (చినగంజాం)/యద్దనపూడి/చినగంజాం: నియోజకవర్గంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన లేకండా అధికారుల బృందం పర్యవేక్షించాలని పర్చూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి జీ రవీందర్ సూచించారు. మంగళవారం పర్చూరులో ఆయన ఎన్నికల అధికారుల బృందంతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ నుంచి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉందన్నారు. పార్టీ కార్యాలయాలు, సభలు, సమావేశాలు, ర్యాలీలు, కరపత్రాల పంపిణీ ప్రతి విషయానికి అభ్యర్థులు, పార్టీలు అనుమతి తీసుకొని నిర్వహించాలన్నారు. అనుమతులు సువిధ యాప్ ద్వారా గాని, పర్చూరు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో గాని దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సింగిల్ విండో సిస్టం ద్వారా 24 గంటల్లోపు అనుమతులు మంజూరు చేస్తామన్నారు. ప్రతి పార్టీ తు.చ తప్పకుండా ఎన్నికల నియమావళి పాటించాలని కోరారు. అందుకోసం అధికారుల బృందం నిబద్ధతతో పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు సీహెచ్ సుబ్బయ్య, ఎం ప్రమీల, బృందంలోని అధికారులు పాల్గొన్నారు.

■ మండలంలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను పటిష్టంగా అమలు చేయాలని చినగంజాం ఎంపీడీఓ యూబీ వరప్రసాద్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ ఎన్నికలు లోక్‌సభ, రాష్ట్ర శాసన సభ ఎన్నికల సందర్భంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలుపై సమావేశం పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలుతో నిర్వహించారు. మోడల్ కోడ్ పటిష్టంగా చేసి నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, అనుమతి లేని ప్రకటనలు, ప్రచారాలు లేకుండా చూడాలని ఆదేశాలు ఇచ్చారు. వలంటీర్‌లు, సచివాలయ సిబ్బంది, అధికారులు వాట్సప్ గ్రూప్‌లలో, పేస్‌బుక్‌లు ఇతర మీడియా ద్వారా ఎటువంటి పార్టీలకు సంబంధించిన ప్రచారాలు చేయరాదని, ఫార్వర్డ్ చేయడం, డీపీలు ఉండటం చేయరాదన్నారు. వలంటీర్‌లు ప్రచారాలుకు దూరంగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ జీవీఎస్ ఫణీంద్ర బాబు, ఎస్ఐ ఎం శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

■ ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు అనేది వజ్రాయుధం లాంటిదని ప్రతి ఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని యద్దనపూడి తహశీల్దారు ఎస్. నాగరాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన యద్దనపూడిలో ఓటుహక్కుపై అవగాహన కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజమైన ప్రజాస్వామ్యానికి పునాది ఓటు అని దానిని ఎవరూ నోటుకు అమ్ముకోవద్దని మనం వేసే ఓటుతోనే నవసమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు విష్ణుప్రసాద్, పోలీస్ సిబ్బంది, బీఎల్ఓలు, కార్యాలయ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.



చీరాలలో ర్యాలీ నిర్వహిస్తున్న సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు

చీరాల రూరల్: రానున్న ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని నోడల్ ఆఫీసర్ వైపీ రెడ్డి అన్నారు. స్థానిక సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్స్ సిటిజన్స్ సభ్యులతో నోడల్ ఆఫీసర్ గుణశీల మాట్లాడారు. సీనియర్స్ సిటిజన్స్‌కు పోలింగ్ కేంద్రాల వద్ద వారికి కావాల్సిన అన్ని సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఎత్తుగా ఉండే పోలీంగ్ కేంద్రాల వద్ద రైలింగ్ ఏర్పాటు, మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్ల సౌకర్యం వంటివాటిని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్స్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిహరరావు, అసోసియేట్ ప్రసిడెంట్ యల్లమందా రెడ్డి, చైతన్య మనోవికాస కేంద్రం నిర్వహకులు వెంకన్న బాబు, నోడల్ టీమ్ సభ్యులు గోపిరెడ్డి, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి..

అద్దంకి రూరల్: సార్వత్రిక ఎన్నికలు ప్రశాతంగా నిర్వహించుకునేందుకన రాజకీయ పార్టీలు సహకరించాలని ఆర్వో టీవీ సునీల్‌కుమార్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ బూత్ ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐదు మండలాల తహసీల్దార్‌లు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.



చినగంజాంలో సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వరప్రసాద్



పర్చూరులో ఎన్నికల అధికారుల బృందానికి సూచనలిస్తున్న ఆర్ఓ రవీందర్

రాబోయేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే



గ్రామంలో పర్యటిస్తున్న అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ

- నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ

మార్టూరు: రాబోయేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని పర్చూరు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బొబ్బేపల్లి గ్రామంలో ఆయన పర్యటించారు. గ్రామంలో రచ్చబండ వద్ద గ్రామస్తులతో మాట్లాడారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లలా భావిస్తూ సుపరిపాలన అందిస్తున్నాడని తెలిపారు. పథకం అందని గడప ఉందంటే అది సీఎం జగన్‌కే దక్కుంతుందన్నారు. ప్రతిపక్ష పార్టీలు కల్లబొల్లి మాటలు, హామీలు చెప్పుంటాయని వారిని నమ్మవద్దని గ్రామస్తులను కోరారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసే విధంగా పనిచేయాలని గ్రామ నాయకులకు సూచించారు. అనంతరం ముస్లిం మత పెద్దలతో నిర్వహించిన సమావేశంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామానికి చెందిన వలేరు నాగయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో బాలాజీ నాయకులతో కలిసి నాగయ్య కుటుంబాన్ని పరామర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట మార్టూరు, బొబ్బేపల్లి నాయకులు ఉన్నారు.

ఓటర్లకు అనువుగా పోలింగ్ కేంద్రాలు

చీరాల టౌన్: కొద్ది రోజుల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో అన్నీ వసతులను ఏర్పాటు చేస్తున్నామని నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో జి.సూర్యనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 33 వార్డుల్లోని మరియమ్మపేట, జయంతిపేట, జాన్‌పేట, ఉజిలీపేట, ఉడ్‌నగర్, చర్చి కాంపౌండ్, బెస్తపాలెం, పేరాల, హరిప్రసాద్‌నగర్, వైకుంఠపురం తదితర ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆర్వో పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులైన విద్యుత్, మంచినీరు, దివ్యాంగ ఓటర్లుకు కావాల్సిన రెయిలింగ్ వంటి సౌకర్యాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆర్వో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతకర వాతావరణంలో నిర్వహించి ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్నీ ఏర్పాట్లు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఆర్వోలు మున్సిపల్ కమిషనర్ కె.చక్రవర్తి, మండల తహశీల్దార్ కె.నాసరయ్య మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శేఖర్, వీఆర్వోలు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్వో, ఏఈఆర్వోలు

పది పరీక్షలకు ముగ్గురు విద్యార్థుల గైర్హాజరు

కారంచేడు: మండలంలోని స్వర్ణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ పరీక్షలకు మండలంలోని కుంకలమర్రు, కొడవలివారిపాలెం, స్వర్ణ ఉన్నత పాఠశాలలకు చెందిన 147 మంది విద్యార్థులకుగాను 144 మంది హాజరయ్యారని ఎగ్జామ్ చీఫ్ జెల్లి శేఖర్ బాబు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ జీ భాస్కరరావులు తెలిపారు. ముగ్గురు గైర్హాజరయ్యారన్నారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కాపీయింగ్‌లకు పాల్పడకుండా పటిష్ట జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. ఫ్లయింగ్ స్క్వాడ్ మొలబంటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బృందం తనిఖీలు చేశారు.

వ్యభిచారం కేసులో ముగ్గురికి జైలు శిక్ష

- ముగ్గురికి మూడేళ్లు, విటుడికి మూడు నెలల జైలు శిక్ష

చీరాల: వ్యభిచారం గృహం నిర్వహిస్తున్న ముగ్గురికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ చీరాల అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎం.సుధ మంగళవారం తీర్పు నిచ్చారు. ఒన్‌టౌన్ సీఐ శేషగిరిరావు వివరాల మేరకు.. చీరాల ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బోడిపాలెంలో 2019లో వ్యభిచార గృహాన్ని నడుపుతున్నారనే సమాచారంతో అప్పటి సీఐ ఎస్.నాగమల్లేశ్వరరావు సోదాలు నిర్వహించి నలుగురు యువతులను అదుపులోకి తీసుకుని విచారించారు. అలానే విటుడు పామర్తి గిరిబాబును విచారించి కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసును విచారణలో భాగంగా చీరాల అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎం.సుధ కేసులో సాక్షులను విచారించారు. వ్యభిచారం గృహం నిర్వహిస్తున్న అన్నపురెడ్డి కోటమ్మ, అన్నపురెడ్డి శంకర్, అన్నపురెడ్డి హనుమంతరావులకు ఒక్కొక్కరికి మూడు సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ.6 వేలు జరిమానా విధించారు. అలానే విటుడు గిరిబాబుకి మూడు నెలలు సాధారణ జైలు శిక్ష విధించారు. కేసులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పద్మ వాదనలు వినిపించారు. ప్రస్తుత ఒన్‌టౌన్ సీఐ శేషగిరిరావు, కోర్టు కానిస్టేబుల్ నీలకంఠారెడ్డి సాక్షులను సరైన సమయంలో కోర్టుకు హాజరుపరచి కేసులో శిక్ష పడేలా చేశారు.

428 మందికి వైద్యపరీక్షలు



రోగితో మాట్లాడుతున్న వైద్యాధికారి

బల్లికురవ: ప్రభుత్వం గ్రామాల్లోనే ప్రజలకు ఇంటింటా వైద్యసేవలు అందించేందుకు ఆరోగ్య సురక్ష క్యాంపులను ఏర్పాటు చేసిందని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు భారతి, మమత అన్నారు. మంగళవారం మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. 428 మందికి వివిధ రకాల పరీక్షలతో మందులు పంపిణీ చేశారు. వీరిలో ఇరువురిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ వైద్యశాలలకు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా చెన్నకేశవస్వామి ఆలయ వార్షికోత్సవం



విశేష అలంకరణలో చెన్నకేశవస్వామి

యద్దనపూడి: మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలో కొలువై ఉన్న చెన్నకేశవ స్వామి ఆలయ అనంత వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి సుప్రభాతసేవ, తోమాల, విశ్వక్సేణ, పుణ్యాహవచన, మండపారాధనలు, అభిషేకాలు అర్చకులు నారాయణం శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు విష్ణుసహస్రనామ, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

చినగంజాం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002–03లో 10వ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు మంగళవారం చినగంజాంలో కలుసుకున్నారు. మండలంలోని పల్లెపాలెం సముద్ర తీరంలో కలుసుకొని తమ అనుభవాలను ఒకరికొకరు పంచుకున్నారు. అందరూ కలిసి సహపంక్తి భోజనం చేసిన అనంతరం సమాజ సేవకు సంబంధించి తమ బ్యాచ్ తరఫు నుంచి చర్యలు తీసుకుందామని తీర్మానం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆసోది సురేష్‌రెడ్డి, సోంబాబు, రామిరెడ్డి, దేశంశెట్టి సురేష్, ఇస్మాయిల్, అంజిరెడ్డి, రాజా, సురేంద్ర, శివశంకర్ రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సాగర్‌రెడ్డి, నరసింహారెడ్డి, సురేష్‌బాబు పాల్గొన్నారు.

ఆశాజనకంగా మొక్కజొన్న

- బహిరంగ మార్కెట్లో క్వింటాల్‌కు రూ.2,200
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతన్నలు



బుర్లవారిపాలెంలో వేసిన మొక్కజొన్న



మొక్కజొన్న పంటను ట్రాక్టర్లలో తరలిస్తున్న రైతులు

చీరాల రూరల్: రబీ సీజన్‌లో వేసిన మొక్కజొన్న పంట రైతులకు సిరులు కురిపిస్తోంది. ప్రతి ఏడాది కంటే ఈ ఏడాది అధికంగా క్వింటాల్‌కు రెండు నుంచి మూడు వందలు అధికంగా రాబడి వచ్చిందని రైతులు ఎంతో ఆనందంగా చెప్తున్నారు. ఈ ఏడాది రబీలో చీరాల మండలంలోని బుర్లవారిపాలెం, పిట్టువారిపాలెం, వాడరేవు, గవినివారిపాలెం గ్రామంలో కొంత వరకు వేసిన మొక్కజొన్న పంట (సుమారుగా 500 ఎకరాలకుపైగా) మిచాంగ్ తుఫానుకు కొంతమేర దెబ్బతిన్నది. అయినప్పటికీ రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించడంతో దిగుబడి పూర్తిస్థాయిలో రైతుల చేతికందివచ్చింది. దీంతో బయ్యర్లు బహిరంగ మార్కెట్లో రైతులకు అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేశారు. గతంలో క్వింటాల్ రూ.1,900 ఉండగా ఈ ఏడాది రూ. 2,200 ధర పలికింది.

ఆర్బీకేల ద్వారా తక్కువ ధరలకు ఎరువులు..

రైతు భరోసా కేంద్రాలు లేనప్పుడు రైతులు చీరాల నుంచి ఎరువుల డీలర్ల వద్ద అధిక ధరలు వెచ్చించి ఎరువులు, పురుగుల మందులు కొనుగోలు చేసేవారు. డీలర్ల వద్ద కొనుగోలు చేసిన ఎరువులను పొలాల్లోకి చేర్చటానికి రైతులకు రవాణా ఖర్చులు తడిసి మోపడయ్యేవి. అయితే రైతు భరోసా కేంద్రంలో రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు తక్కువ ధరకు విక్రయించడమే కాకుండా గ్రామ పంచాయతీలోనే ఆర్బీకేలు ఉండడంతో రవాణా ఖర్చులు పూర్తిగా తగ్గిపోయాయి. దీంతో రైతులు ఎంతో ఆనందంగా ఎరువులను సులువుగా పొలాలకు తీసుకెళ్లి పిచికారీ చేసుకునేవారు. అదీకాక సచివాలయాలలోనే వ్యవసాయ అధికారులు నిత్యం రైతులకు అందుబాటులో ఉండడంతో ఏ సమయాలలో పురుగు మందులు వాడాలి, ఎప్పుడు ఎంత పరిమాణంలో మందులు వాడాలనే విషయాలపై రైతులకు సూచనలు, సలహాలు అందిస్తున్నారు. దీంతో రైతులు ప్రస్తుతం జగనన్న ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వమని రైతులు ఆనందంగా చెప్తున్నారు.

> **ఎరువులు, పురుగు మందులు సకాలంలో అందించాం..**
>
> రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులు సకాలంలో అందించాం. వారికి కావాల్సిన సలహాలు, సూచనలను ఎప్పటికప్పుడు రైతులకు వివరిస్తూ పంటలను సక్రమంగా కాపాడటంలో సహకరించాం. దీంతో రైతులు ఉన్న పంటను జాగ్రత్తగా కాపాడి అధిక దిగుబడులు సాధించారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది ధరలు ఎంతో ఆశాజనకంగా ఉన్నాయి.
>
> – సుమతి, ఏవో

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వెంకటేష్



పూజలు చేస్తున్న అసెంబ్లీ అభ్యర్థి వెంకటేష్

చీరాల టౌన్: మున్సిపాలిటీలోని పాపరాజుతోటలో మంగళవారం నిర్వహించిన శ్రీలక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి కరణం వెంకటేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కల్యాణ మహోత్సవాల్లో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చీమకుర్తి బాలకృష్ణ, రవి షాపింగ్‌మాల్ అధినేత తిరువీధుల రవి, కె.సుబ్బారావు, సేవాదళ్ ఉపాధ్యక్షులు గోలి గంగాధర్, మురళీ, పవన్, లీలాధర్ తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురికి పదవులు

చీరాల: వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గంలో అనుబంధ విభాగాల అధ్యక్షుల జాబితాను పార్టీ కేంద్ర కార్యాలయం విడుదల చేసింది. వీరిలో చీరాల రూరల్ మండలంలో ఎస్సీ సెల్ అధ్యక్షులుగా దేవరపల్లి అబ్రహాం, బీసీ సెల్ అధ్యక్షులిగా గుంటూరు వెంకట సుబ్బారావు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా శీలం వెంకటేశ్వరమ్మ, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా షేక్ మస్తాన్‌లను నియమించారు. పదవులు పొందిన వారు ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

మందకృష్ణకు బుద్ధి చెప్పాలి

పర్చూరు (చినగంజాం): వ్యక్తిగత స్వార్థం కోసం మాదిగలను మోసం చేస్తున్న మందకృష్ణకు బుద్ధిచెప్పాలని పర్చూరు మండల వైఎస్సార్ సీపీ నాయకులు కూరాకుల ఇస్సాక్ డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్‌లు ఎత్తేస్తామంటున్న పార్టీలకు ఓటు వేయమంటున్న మంద కృష్ణమాదిగ వ్యవస్థను బలితీసుకుంటున్నారన్నారు. గత 30 ఏళ్లుగా వర్గీకరణ పేరుతో మాదిగలను మోసం చేస్తూనే ఉన్నారన్నారు. కేంద్రంలో బీజేపీని, రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపించాలని అదికూడా టీడీపీ గెలుపు మాదిగల గెలుపు అని అభివర్ణించడం అతని దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు. తాను చెప్పినట్లే టీడీపీకి ఓట్లు వేసి గెలిపిస్తే అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చనే మార్చమని, రిజర్వేషన్‌లు ఎత్తేయమని ప్రధాన మంత్రి మోదీ చేత ఢిల్లీలో ఎర్రకోట మీద ప్రతిజ్ఞ చేయించాలన్నారు. టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చేత విజయవాడ అంబేడ్కర్ విగ్రహం ముందు ప్రతిజ్ఞ చేయించాలని ఆయన సవాల్ విసిరారు.

ఆటో బోల్తా, భార్యభర్తలకు తీవ్రగాయాలు

జే.పంగులూరు: కొబ్బరి బొండాల ఆటో బోల్తా పడి భార్యభర్తలకు తీవ్రగాయాలయ్యాయి. ఈఘటన మండల పరిధిలోని ముప్పవరం, పంగులూరు మధ్య మంగళవారం చోటు చేసుకుంది. అందిన వివరాల మేరకు.. మండల పరిధిలోని తూర్పు తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన పాలపర్తి చిన్న, భార్య మహాలక్ష్మి ముప్పవరం గ్రామంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో పళ్ల వ్యాపారం చేస్తుంటారు. రోజు మాదిరిగానే వ్యాపారం ముగించుకొని తన ఆటోలో కొబ్బరి బొండాలు వేసుకొని గ్రామానకి బయలు దేరారు. ముప్పవరం, పంగులూరు మధ్యలోకి వచ్చేసరికి ఆటో అదుపుతప్పి సైడు కాలువలోకి బోల్తా కొట్టింది. ఈప్రమాదంలో భార్యభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 సహాయంతో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

వైభవంగా అభయాంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ట



యాగశాలలో కలశపూజ

బల్లికురవ: మండలంలోని గొర్రెపాడు గ్రామంలో అభయాంజనేయస్వామి, బాలాంజనేయస్వామి గణపతి విగ్రహాల వాయు ప్రతిష్టలో భాగంగా రెండోరోజు మంగళవారం యాగశాలలో కలశపూజ హోమాలు చేపట్టారు. ప్రతిష్టా చార్యులు ఓరుగంటి సీతారామశాస్త్రి, జే. శ్రీనివాస మూర్తి బృందంచే యాగశాలలో వేద మంత్రోచ్చరణలో హోమాలు గణపతి పూజ రక్షాబంధన కలశపూజలు మూడు విగ్రహాలకు దాన్యాధి, సలాధి, పుష్పాధి, శయ్యాధివాసం చేపట్టారు. బుధవారం ఉదయం 8.14 గంటలకు యంత్రప్రతిష్ట విగ్రహాల ప్రతిష్ట పూర్ణాహుతి, అన్నసంతర్పణ చేపట్టారు. ప్రతిష్ట వేడుకల్లో భాగంగా గ్రామంలో బంధుమిత్రుల రాకతో ప్రతి ఇంటా పండుగా వాతావరణం నెలకొంది. గ్రామంతో పాటు పరిసర గ్రామాల్లోని భక్తులు వేడుకల్లో పాల్గొని స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ కోరుతున్నారు.